## క్లుప్తంగా

### పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయమే అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. కొందరు అమ్మవారికి చీర, సారె, పిండివంటలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

### ఘనంగా చర్చి ప్రారంభం



బిషప్‌ను సన్మానిస్తున్న దృశ్యం

దొర్నిపాడు: మండలంలోని కొండాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన సీఎస్‌ఐ చర్చిని ఆదివారం నంద్యాల డయాసిస్ బిషప్ రైట్ రెవరెండ్ డాక్టర్ పుష్పలత ప్రారంభించారు. అనంతరం ఆమె క్రీస్తుపై దైవ సందేశం ఇచ్చారు. బిషప్‌ను క్రైస్తవులు నూతన చర్చిలో సత్కరించారు. సంఘ పెద్దలు, ఆళ్లగడ్డ ఇమ్మానుయేలు, చర్చి డీనరీ చైర్మన్ రెవరెండ్ సునీల్‌కుమార్, ఆళ్లగడ్డ డీనరీ ఉయ్యాలవాడ ఫ్రాస్బైట్ చైర్మన్ రెవరెండ్ జోషి నతానియేలు పాల్గొన్నారు.

### పెండింగ్ వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న హృదయరాజు

నంద్యాల(న్యూటౌన్): హేతుబద్ధీకరణ ద్వారా జరిగిన బదిలీలు, పదోన్నతులు పొందిన 60వేల మంది ఉపాధ్యాయులకు జూన్, జూలైకు సంబంధించిన జీతాలను తక్షణమే చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ కమిషనర్ బదిలీలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయుల క్యాడర్ స్ట్రెంత్ వివరాలను డైరెక్ట్ ట్రెజరీకి పంపించి త్వరగా జీతాలు ఇవ్వాలన్నారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, సరెండర్ బిల్లు తదితర వాటిని వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర కార్యాదర్శి నగరి శ్రీనివాసులు, మధుసూధన్‌రావు, స్వామినాథం, లింగమయ్య, వెంకటరాముడు, భగవాన్, జయరామ్ పాల్గొన్నారు.

### మణిపూర్ ఘటనలు మానవత్వానికి ముప్పు



చర్చ కార్యక్రమంలోమాట్లాడుతున్న వక్తలు

నంద్యాల(వ్యవసాయం): మణిపూర్ రాష్ట్రంలో ఇటీవల జరుగుతున్న అరాచకాలు, నేరాలు భారతజాతిని కలవర పెడుతున్నాయని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస మూర్తి అన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీవోస్ హోమ్‌లో మణిపూర్ ఘటనలు–వైషమ్యాల నివారణ అనే అంశంపై సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో చర్చ కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాస కుమార్ మాట్లాడుతూ మణిపూర్ ఘటనల్లో ఇప్పటి వరకు దాదాపు 150 మంది ప్రాణాలు కోల్పోయారని వేలాది మంది నిరాశ్రయులయ్యాలరన్నారు.అక్కడ జరుగుతున్న అత్యాచారాలు, వేధింపులు సభ్య సమాజానికి తలవంపులు తెస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి అక్కడ శాంతి భద్రతలను పునరుద్ధరించాలని కోరారు. శ్రీనివాసరెడ్డి, మద్దిలేటి రామసుబ్బయ్య, డీవిసుబ్బయ్య, గురుస్వామి, నాగరాజు పాల్గొన్నారు.

### పుట్టాలమ్మకు ప్రత్యేక పూజలు

ఆళ్లగడ్డ: మండలంలోని రామతీర్థం పుట్టాలమ్మ క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని పుట్టాలమ్మ, శ్రీవల్లిదేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, కొండపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి, శివపార్వతులను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పుట్టాలమ్మ వారికి ఒడి బియ్యం, నూతన చీరలు, పాలు, పండ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

### అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులు ఆశీనులుగావించి వేదమంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. కార్యక్రమాల్లో ఈఓ ఎస్ లవన్న, అర్చకులు పాల్గొన్నారు.



పల్లకోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

**నంద్యాల నుంచి తిరుపతి వెళ్లేందుకు** ఒక్క ప్యాసింజర్ రైలు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఉదయం వేళల్లో రైలు లేక రోడ్డు మార్గంలో వెళ్తున్నారు. నంద్యాల–కడప డెమో ప్యాసింజర్‌ను తిరుపతి వరకు పొడిగించాలని ప్రయాణికులు కోరుతున్నా.. ఆ శాఖ అధికారులు మాత్రం రేణిగుంట వరకు నడుపుతామని చెప్పినా నేటికీ అమలుకు నోచుకోలేదు. నంద్యాల నుంచి ఉదయం 9:30 గంటలకు కడప చేరుకుని సాయంత్రం 5:30 వరకు ఖాళీగా ఉంచుతుండటంతో సంస్థ ఆదాయాన్ని సైతం కోల్పోతుంది.

# రైలు బండి.. ముందుకు నడపండి

- ప్రస్తుతం నంద్యాల నుంచి కడప వరకే నడుస్తున్న డెమో
- నంద్యాల నుంచి రేణిగుంట వరకు నడపాలని ఆ శాఖాధికారుల ప్రతిపాదన
- నేటికీ అమలుకు నోచుకోని వైనం
- తిరుపతి వరకు పొడిగించాలని ప్రయాణికుల డిమాండ్
- డెమో పొడిగింపుతో నంద్యాల జిల్లా వాసులకు ప్రయోజనం



నంద్యాల డెమో రైలు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల–కడప మధ్య నడిచే డెమో ప్యాసింజర్ రైలు కడపను వదలడం లేదు. 77401/77402 నంబరుతో నడుస్తున్న డెమోను తిరుపతికి పొడిగించాలనే ప్రతిపాదన రైల్వే శాఖ చేసింది. అయితే ఆ ప్రతిపాదనను ఆ శాఖ ఇప్పటికీ అమలు చేయడం లేదు. నంద్యాల, బనగానపల్లె, కోవెలకుంట్ల, సంజామల, నొస్సం, ఉప్పపాడు, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన వారు తిరుపతి వైపు వెళ్లేందుకు అనువుగా ఉంటుందనే డెమోను తిరుపతి వరకు పొడిగించే ప్రతిపాదనను తీసుకొచ్చారు.

**తిరుపతి వరకు పొడిగించాలని డిమాండ్..**

నంద్యాల, ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లా వాసులు సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుపతికి వెళ్లేందుకు అనువుగా ఈ డెమో ప్యాసింజర్ రైలు ప్రయోజనకరమని భక్తులు భావిస్తున్నారు. అయితే అధికారులు మాత్రం ఈ రైలును రేణిగుంట వరకే ప్రతిపాదించారు. కానీ భక్తులతో పాటు నిత్యం విద్యార్థుల, ఉద్యోగులు, అధికారులు విధి నిర్వహణ నిమిత్తం తిరుపతికి వెళ్లే వారు అధికంగా ఉన్నారు. ఈ రైలు తిరుపతి వరకు పొడిగిస్తే పల్లె ప్రాంతాల వైపు వెళ్లే యాత్రికులకు ఉపయోగకరంగా ఉంటుందని ప్రయాణికులు సైతం పేర్కొంటున్నారు.

**ఉదయం పూట తిరుపతికి రైలు ఏదీ..?**

నంద్యాలతో పాటు వైఎస్సార్ కడప జిల్లాలకు చెందిన యాత్రికులు నేరుగా తిరుపతికి వెళ్లేందుకు వీలుగా డెమో నడపాలని పలువురు కోరుతున్నారు. ఈ మార్గంలో ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు నడుస్తుంది. కానీ ప్యాసింజర్ రైలు ఒక్కటి కూడా లేకపోవడం విచారకరం. గతంలో బొగ్గుతో నడిచే కాలంలోనే కడప నుంచి తిరుపతికి ప్యాసింజర్ రైలు ఉదయం పూట నడిచేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని ప్రయాణికులు వాపోతున్నారు.

**ఉదయం నుంచి సాయంత్రం వరకు వృథాగా..**

నంద్యాల–కడప డెమో ప్యాసింజర్ ఉదయం నుంచి సాయంత్రం వరకు వృథాగానే నిలిచిపోతుంది. నంద్యాల నుంచి వచ్చిన డెమోను కడప రైల్వే స్టేషన్ లోపలి లైన్‌లో స్టేబుల్ చేస్తారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఖాళీగా ఉంటోంది. దీంతో పరోక్షంగా సంస్థ ఆదాయం కోల్పోయినట్లేనని రైల్వే వర్గాలు చెబుతున్నాయి.

**పొడిగింపు టైమింగ్స్ ఇలా..**

నంద్యాల–కడప డెమో ప్యాసింజర్ రైలును రేణిగుంట వరకు పొడిగిస్తే.. టైమింగ్స్ ఇలా ఉంటాయని రైల్వే శాఖ గతంలో ప్రకటించింది. నంద్యాలలో ఉదయం 5.30 బయల్దేరి కడపకు 9.40 గంటలకు చేరుకుంటుంది. 9.40 కడప నుంచి బయల్దేరి రేణిగుంటకు 1.30 గంటలకు చేరుకుంటుంది. రేణిగుంటలో తిరిగి 2.30 గంటలకు బయల్దేరి కడపకు 5.30 గంటలకు, నంద్యాలకు 9.30 గంటలకు చేరుకునేలా సమయం నిర్ణయించారు. స్టాపింగ్ స్టేషన్లు.. బనగానపల్లె, సంజామల, కోవెలకుంట్ల, నొస్సం, ఉప్పలపాడు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, ఒంటిమిట్ట, రాజంపేట, రైల్వే కోడూరు ఉన్నాయి.

**ఉదయం పూట తిరుపతికి ఒక్క ప్యాసింజర్ లేదు**



జిల్లా మీదుగా ఉదయం పూట తిరుపతికి వెళ్లేందుకు ఒక్క ప్యాసింజర్ రైలు లేదు. తెల్లవారుజామున ధర్మవరం, రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైళ్లు చాలా స్టేషన్లలో నిలవడం లేదు. పల్లె ప్రాంతాల వాసులు తిరుపతికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. నంద్యాల డెమో ప్యాసింజర్ రైలును రేణిగుంట వరకు పొడిగిస్తామనే ప్రతిపాదన ఉన్నా.. ఇంత వరకు అమలు చేయలేదు. రేణిగుంటకు కాకుండా తిరుపతి వరకు పొడిగిస్తే అందరికీ ప్రయోజనకరంగా ఉంటుంది. సంస్థకు కూడా ఆదాయం పెరుగుతంది. – ఎల్లయ్య, చాపిరేవుల, నంద్యాల

**నంద్యాల డెమోను తిరుపతి వరకు పొడిగించాలి**



నంద్యాల–కడప డెమో రైలును తిరుపతి వరకు పొడిగించాలి. అయితే రైల్వే శాఖ మాత్రం రేణిగుంట వరకు పొడిగించేలా ఉన్నతాధికారులకు ప్రతిపాదన పంపిందని చెబుతున్నా అమలు చేయలేదు. అయితే నంద్యాల నుంచి తిరుపతికి వెళ్లాలంటే యాత్రికులు ఇబ్బందులు పడుతున్నారు. అందువల్ల నంద్యాల ప్రాంత వాసులకు ఉదయం పూట ప్యాసింజర్ రైలు అందుబాటులోకి తీసుకురావాలి. ఇది పల్లె ప్రయాణికులకు ఎంతగానో దోహదపడుతుంది.

– రియాజ్, వ్యాపారి, నంద్యాల

### నేడు స్పందన

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దార్ రవి కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల పరిధిలో కూడా రోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన నిర్వహిస్తున్నారని చెప్పారు. అయితే సచివాలయాల పరిధిలో బాధితులకు న్యాయం జరగకపోతే మండల కేంద్రంలో జరిగే కార్యక్రమానికి హాజరై సమస్యలపై అర్జీలు సమర్పించుకోవాలని కోరారు.

### వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం పాటు కొండుపల్లె, ఇంజేడు, అక్కంపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాయలూరు, సుద్దమల్ల ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు త్రీఫేస్ సరఫరా చేస్తామని ఏఈ వివరించారు.

గోస్పాడు: మండలంలోని రైతులకు 9గంటల నిరంతర విద్యుత్ అందిస్తున్నట్లు ఏఈ జ్ఞానసూర్యుడు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ విద్యుత్ సరఫరాను రెండు గ్రూపులుగా విభజించామని, సోమవారం నుంచి ఆదివారం వరకు సరఫరా వేళలను వివరించారు. ఏ – గ్రూపులో గోస్పాడు పరిధిలోని ఎం.చింతకుంట్ల, యాళ్లూరు ఫీడర్ కింద సత్యనారాయణాపురం, దీబగుంట్ల ఫీడర్ కింద మసీదుపురం, మోతుకుల పల్లెకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. అలాగే బి గ్రూపులో ఒంటి వెలగల ఫీడర్ కింద యాళ్లూరు సబ్ స్టేషన్ పరిధిలో ఎం.కృష్ణాపురం, దీబగుంట్ల సబ్ స్టేషన్ పరిధిలో చెన్నూరు, నాగులవరం, గ్రామాలకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 6.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు.

## సొసైటీని రద్దు చేయండి

నంద్యాల(న్యూటౌన్): పద్మావతి నగర్ సొసైటీపై వస్తున్న ఆరోపణలను దృష్టిలో ఉంచుకొని సొసైటీని రద్దు చేసి అధికారులతో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేయాలని, పేదల ఆధీనంలో ఉన్న సర్వే నంబర్ 703లోని ప్రభుత్వ భూమిలో ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబ ఫక్రుద్దీన్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం సీపీఐ ఆధ్వర్యంలో పద్మావతినగర్ స్థలాలను పరిశీలించి ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ పట్టణ నడిబొడ్డున ఉన్న పద్మావతి నగర్ సొసైటీలో అవకతవకలు జరిగాయని సొసైటీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు స్థలాలకు భూముల విలువ పెరిగిందని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను కబ్జాలు చేశారన్నారు. 22 సంవత్సరాల క్రితం ఏర్పడిన పద్మావతి నగర్ సొసైటీ 8 మంది కమిటీ సభ్యులు, 1,456 మంది సభ్యులతో కమిటీ ఏర్పడిందన్నారు. అయితే కమిటీ సభ్యులకు తెలియకుండా అన్నదమ్ములు ఆస్తి పంపకాలు చేసుకున్నట్లు ఒకరికి తెలియకుండా ఇంకొకరు రిజిస్టర్ చేయించుకోవడం దారుణమన్నారు. రఘురామమూర్తి, ప్రసాద్, ధనుంజయుడు, ప్రభాకర్, శ్రీనివాసులు, సుబ్బరాయుడు, హుసేన్ బాషా, మాబాషా పాల్గొన్నారు.



## కుందూ తీరం..గులాబీ వర్ణం

**భానుడు అస్తమించే సమయంలో** ఆకాశంలో విభిన్న వర్ణాలు ఆవిష్కృతమవుతుంటాయి. సీజన్, ప్రాంతాన్ని బట్టి ఈ రంగులు మారుతుంటాయి. ఇటీవల కురిసిన వర్షాలతో క్రిష్టిపాడు వద్ద తేట తెల్లగా పారుతున్న కుందూ నదీ పరిసరాలు ఆదివారం లేత గులాబీ రంగులోకి మారాయి. ఈ దృశ్యాలు చూపరులను కట్టిపడేశాయి. మేఘావృతమైన ఆకాశంలో మబ్బుల మాటున భానుడి నిద్రలోకి జారుకుంటున్న వేళ చోటు చేసుకున్న మార్పులు ఆకట్టుకునాయి. –దొర్నిపాడు

### గంగమ్మకు ప్రత్యేక పూజలు

నంద్యాల(అర్బన్): సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో ఇళ్లు కళకళలాడాలని కోరుతూ పట్టణ రజక సంఘం ఆధ్వర్యంలో మహిళలు ఆదివారం స్టేట్ బ్యాంక్ కాలనీలోని గంగమ్మకు బోనాలు సమర్పించారు. సంఘం పెద్దలు తిమ్మయ్య, నరసింహులు, రాము, మధు, రంగనాయకులు, జయరాముల ఆధ్వర్యంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని బోనాలు సమర్పించి పూజలు చేశారు.

### 'ఆరోగ్యమాత' డైరెక్టర్ నియామకం

నంద్యాల(అర్బన్): పట్టణంలో వెలసిన ఆఆరోగ్య మాత పుణ్యక్షేత్రం డైరెక్టర్‌గా గురుశ్రీ మేసాప్రసన్న కుమార్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ దేవుని ప్రేమలో విస్వాసులు శాంతి సమాధానం, ప్రేమాగుణంతో ఆధ్యాత్మికంగా నడవడానికి కృషి చేస్తానన్నారు. అనంతరం క్షేత్రంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అంతకు ముందు జరిగిన కార్యక్రమంలో పుణ్యక్షేత్రం డైరెక్టర్‌గా ఐదేళ్ల పాటు సేవలందించి అమెరికాకు బదిలీపై వెళ్తున్న గురుశ్రీ జాన్ దేవదానును కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

### కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేయాలి

నంద్యాల(న్యూటౌన్): విద్యుత్ శాఖలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేయాలని ఏఐటీయూసీ నాయకులు శ్రీనివాసులు, ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా కాంట్రాక్టు కార్మికులు 24వేల మంది పనిచేస్తున్నారని విద్యుత్ శాఖలో విలీనం చేసి న్యాయం చేయాలన్నారు. విద్యుత్ ఉద్యోగులు చేస్తున్న ఆందోళనకు మద్దతు ప్రకటిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో రఘురామమూర్తి, సీఐటీయూ నాయకులు బాలవెంకట్, శ్రీరాములు, చింతలయ్య, కృష్ణమూర్తి, సుధాకర్, చౌడప్ప పాల్గొన్నారు.

### జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): మహిళలపై జరుగుతున్న వేధింపులపై మహిళా సంఘం ఆధ్వర్యంలో వచ్చే నెల 5వ తేదీన జరిగే బస్సు యాత్రను విజయవంతం చేయాలని మహిళా మండలి అధ్యక్షురాలు నిర్మల పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ మహిళలపై అఘాయిత్యాలకు కారణమైన మద్యం, గంజాయిని నిషేధించాలని డిమాండ్ చేశారు. 5న నంద్యాలలోని గాంధీ చౌక్‌లో జరిగే సభకు మహిళలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మహిళలు భాను, లక్ష్మీ, మధుప్రియ, సుభద్ర, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

## అంకాలమ్మకు బోనాల సమర్పణ




బోనాలు తీసుకువస్తున్న ఈఓ, అర్చకులు, ఆలయాధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలక్షేత్రంలోని గ్రామదేవత అంకాలమ్మకు మూలనక్షత్రం పురస్కరంచుకుని ఆదివారం దేవస్థానం తరపున బోనాలను సమర్పించారు. ఈఓ ఎస్ లవన్న, స్వామివారి ప్రధానార్చకులు శివప్రసాద్‌స్వామి, అమ్మవారి ఆలయప్రధానార్చకులు మార్కండేయశాస్త్రి, ఆలయ సహాయ కార్యనిర్వాహణాధికారి ఐఎన్‌వీ మోహన్, అర్చకులు, వేదపండితులు నూతన వస్త్రాలను, పసుపు కుంకుమ, గాజులు, ఫలపుష్పాదులు సమరిప్పించి, అమ్మవారి విశేషపూజలు నిర్వహించారు. సంకల్పాన్ని పఠించి, బోనాలను సమర్పించారు. కాగా అంకాళమ్మ అమ్మవారికి దేవస్థానం తరపున బోనాలు సమర్పించడం ఇదే మొట్టమొదటిసారి. ఇకపై ప్రతి సంవత్సరం దేవస్థానం తరపున అంకాలమ్మకు బోనం సమర్పించడం జరుగుతుందని ఈఓ తెలిపారు.

## జలం సిద్ధం.. సాగుకు సన్నద్ధం

- నిండుకుండల్లా కుందూ, కేసీ





క్రిష్టిపాడు వద్ద బ్రిడ్జికి సమాంతరంగా ప్రవహిస్తున్న కుందూ, వెంకటేశ్వరనగరం వద్ద కేసీ పరవళ్లు

దొర్నిపాడు: ఇటీవల కురిసిన వర్షాలకు కుందూ నది, కేసీ కెనాల్ నిండుకుండల్లా ప్రవహిస్తున్నాయి. ఈ ఏడాది అదునులో వర్షాలు కురవకపోవడంతో మెట్ట, వర్ష ఆధారిత పంటలను మాత్రమే సాగుచేసుకోవాలని అధికారులు సూచించారు. ఇటీవల ఎగువ ప్రాంతలో భారీ వర్షాలు కురువడంతో కుందూ నది, కేసీ కెనాల్‌కు నీరు పుష్కలంగా రావడంతో రైతన్నలు వరి సాగుకు సన్నద్ధం అవుతున్నారు. ప్రస్తుతం వరి బస్తా (70 కేజీలు) రూ.2వేలకు పైగా ఉండటంతో సాగువిస్తీర్ణం పెరిగే అవకాశముంది. క్రిష్టిపాడు, గుండుపాపల, కేసీ కింద రామచంద్రాపురం, వెంకటేశ్వరనగరం, దొర్నిపాడు, బుర్రారెడ్డిపల్లె, చాకరాజువేముల, డబ్ల్యూ.కొత్తపల్లె, కొండాపురం, అమ్మిరెడ్డినగరం, భాగ్యనగరం, అర్జునాపురం, డబ్ల్యూ.కొత్తపల్లె గ్రామాల రైతులు కుందూ,కేసీ కింద మిరప, పత్తి, వరి సాగు చేయనున్నారు.



బోడెమ్మనూరు సమీపంలో కుందూ నది నుంచి నారుమళ్లకు నీరు మళ్లించుకుంటున్న దృశ్యం

ఉయ్యాలవాడ : కురిసిన వర్షాలతో మండలంలో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. తుఫాన్ ప్రభావంతో ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో కుందూ నదిలో భారీగా వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో ఖరీఫ్ సీజన్‌కు అదును దాటుతుందని రైతులు సమాయత్తమవుతున్నారు. బోడెమ్మనూరు, ఉయ్యాలవాడ, రూపనగుడి, మాయలూరు, అల్లూరు, కాకరవాడ, పెద్దయమ్మనూరు, హరివరం, ఆర్.జంబులదిన్నె, నర్సిపల్లె, సుద్దమల్ల గ్రామాలలో వరి పంట సాగు చేసేందుకు నారు మళ్లు సిద్ధం చేసుకుంటున్నారు.

## వృద్ధులు దైవంతో సమానం



వృద్ధులను సన్మానిస్తున్న ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి



సమావేశానికి హాజరైన వృద్ధులు

నంద్యాల(వ్యవసాయం): వృద్ధులు దైవంతో సమానమని, కుటుంబ సభ్యులు వారిని నిర్లక్ష్యం చేయకుండా సేవ చేసి భావి తరాలకు ఆదర్శంగా నిలవాలని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి సూచించారు. ఆదివారం శ్రీకాళీ మాత సేవా సమాజం ఆధ్వర్యంలో 80 సంవత్సరాలు దాటిన వృద్ధుల ఆత్మీయ సమ్మేళనానికి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరై వృద్ధులను ఘనంగా సన్మానించి మాట్లాడారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ అంతరించి పోవడంతో మానవతా విలువలు కూడా నశించిపోయాయని, ఈ తరుణంలో వృద్ధ తల్లిదండ్రుల సంక్షేమం కోసం శ్రీకాళీ మాతా సమాజం వారు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వృద్ధులు పురాతన గ్రంథాలయంతో సమానమని వారి అనుభవాలను నేటి తరం వారు తెలుసుకోవాలని చెప్పారు. డాక్టర్ మధుసూదన రావు , క్రిటియేటివిటీ కృష్ణ తదితరులతో కలిసి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 200 మంది వృద్ధులను ఘనంగా సన్మానించారు. సమాజ్ ఆరవేటి వాసు, విజయ్ కుమార్, రాంప్రసాద్, డాక్టర్ దస్తగిరిరెడ్డి, వైద్యులు సహదేవుడు, ఉదయ్‌శంకర్ పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో లాల్‌స్వామి చిన్న సరిగెత్తు



భక్తుల మధ్య లాల్‌స్వామి పీరును ఊరేగిస్తున్న దృశ్యం

చాగలమర్రి : మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో మొహర్రం సందర్భంగా పదో రోజు లాల్‌స్వామి పీరు పగలు సరిగెత్తును ఆదివారం అశేష భక్త జన సందోహం మధ్య నిర్వహించారు. ఊరేగింపు పీర్ల చావిడి నుంచి మొయిన్ బజార్‌లోని అమ్మవారి శాల మీదుగా దస్తగిరి స్వామి దర్గా వరకు వెళ్లి తిరిగి బెస్తపేటకు వెళ్లి, రెడ్డెం వారి వీధి నుంచి పీర్లచావిడి చేరుకుంది. ఊరేగింపులో భక్తులు స్వామి వారికి ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. కొందరు భక్తులు వెండి గొడుగులు, ఉయ్యాలలు, నిమ్మకాయలు సమరిప్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎస్ఐ రమణయ్య ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

రుద్రవరం: మండలంలోని ఆలమూరు,టీ.లింగందిన్నె,చిన్నకంబలూరు గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఒకరోజు ఆలస్యంగా నిర్వహించారు. మండలంలో శనివారం నిమజ్జనం గావించగా, ఈ మూడు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం నిమజ్జనం చేపట్టారు.ఈ సందర్భంగా యువకులు వివిధ రకాల వేషధారణలతో సందడి చేయగా మరి కొందరు గంధం ఒకరిపై మరొకరు చల్లుకుంటు పీర్లను ఊరేగింపుగా తీసుకెళ్లి వేడుకలను ముగించారు.

**నేడు జియారత్..**

మండల కేంద్రమైన రుద్రవరం మౌలాలి స్వామి పీర్ల చావిడి వద్ద సోమవారం జియారత్ నిర్వహిస్తామని నిర్వాహకులు ఆదివారం తెలిపారు. మొహర్రం ముగిసిన మూడు రోజులకు జియారత్ నిర్వహించడం ఆనవాయితీ అని చెప్పారు.

దొర్నిపాడు: కులమతాలకు అతీతంగా జరుపుకోనే మొహర్రం పూజలు మండలంలో ముగిశాయి. మండల కేంద్రంలోలో ఆదివారం జరిగిన నిమజ్జనంలో వందలాది మంది పాల్గొని పీర్లను ఊరేగించారు. హిందూ, ముస్లింలు సంయుక్తంగా ఫాతెహాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



ఆలమూరులో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం



దొర్నిపాడులో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

## విరాళాలు దుర్వినియోగం చేస్తే చర్యలు

మహానంది: శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామి వార్లకు భక్తులు సమర్పించే విరాళాలు, వస్తువుల విషయంలో సిబ్బంది కొందరు దుర్వినియోగానికి పాల్పడుతున్నారని సమాచారంతో ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి చర్యలకు దిగారు. ఈ క్రమంలో ఆలయంలో పనిచేస్తున్న సిబ్బందికి పలు దిశానిర్దేశాలు చేస్తూ ఆదివారం సర్క్యులర్ జారీ చేశారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో కొందరు భక్తులు సమర్పించే కానుకలను ఇళ్లకు తీసుకెళ్లినట్లు ఆరోపణలు వచ్చాయన్నారు. భక్తితో భక్తులు సమర్పించే వాటిని ఇళ్లకు తీసుకెళ్లడం ఎంతవరకు సమంజసమని మందలించి వదిలేశారన్నారు. అయితే ఇక నుంచి భక్తులు స్వామివారికి సమర్పించే ప్రతి చిన్న, పెద్ద కానుకలు, వస్తువులేవైనా సరే దేవస్థానానికే చెందాలన్న సదుద్దేశంతో హెచ్చరికలు చేశామన్నారు. నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా ప్రవర్తిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.